తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## పద్మావతి పుష్కరిణిలో వైభవంగా చక్రస్నానం



తిరుచానూరు, జనవరి 11, ప్రభాతవార్త

తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి మరునాడు ద్వాదశి రోజు చక్రస్నానం నిర్వహించడం ఆనవాయతీ. ఇందులో భాగంగా సుప్రభాతంతో అమ్మవారిని మేలుకొలిపి సహస్రనామార్చన నిత్యఅర్చన నిర్వహించారు. అనంతరం చక్రతాళ్వారుని ఉత్సవ మండపం వద్దకు వేంచేపు చేసి కన్నుల పండుగగా స్నపన తిరు మంజనం నిర్వహించారు. అనంతరం అమృత గడియల్లో చక్రతాళ్వారును పద్మావతి పుష్కరినిలో స్నానమాచరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పుష్కరినిలో స్నానమాచరించి పునీతులైనారు. అనంతరం చక్రతాళ్వారుని తిరుమాడవీధులలో విహరిస్తూ ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం





తిరుమల, జనవరి 11ప్రభాతవార్తప్రతినిధి:

వైకుంఠద్వాదశి పర్వదినాన శనివారం ఉదయం శ్రీవారి పుష్కరిణిలో చిరుజల్లుల నడుమ చక్రత్తాళ్వార్‌కు చక్రస్నాన మహోత్సవం జరిగింది. భక్తులు విచ్చేసి స్వామివారి పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించారు. గోవిందనామాలతో పుష్కరిణి ప్రతిధ్వనించింది.

# విషాదఘటనలో వీడని మిస్టరీ!

### టిటిడి అత్యుత్సాహమే అమాయకుల ప్రాణాలు తీశాయా!! -తప్పిదాలకు మరో టార్గెట్ ఎవరో!?





ప్రభాతవార్త-తిరుపతి:

వైకుంఠద్వార దర్శనాల ఉచిత సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు అందుకోవడానికి వచ్చి ప్రాణాలు కోల్పోయిన భక్తుల విషాదఘటనలో వీడని మిస్టరీ అంశాలు దాగి ఉన్నాయా?అనే కోణంలో తిరుపతివాసుల్లో చర్చ మొదలైంది. అసలు స్థానికుల కోసం ఆ కేంద్రం ఏర్పాటుచేసినట్లు టిటిడి వర్గాలు భావిస్తున్నా ..అక్కడే ఈ దారుణ ఘటన జరగడం వెనుక కారణాలు ఏమిటన్నది రాజకీయనేతలు కూడా ఒకింత అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై ఇప్పటికే ఉపముఖ్యమంత్రి, జనసేనాని పవన్‌కల్యాణ్ ,రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా ఘటనాస్థలిని, క్షతగాత్రులను పరామర్శించి కుట్ర దాగివుందనే అనుమానం వెలిబుచ్చారు. ఇప్పుడు నిజంగా ఇదే అంశంపై తిరుపతివాసుల్లోనేగాక టిటిడి ఉద్యోగుల్లో కూడా హాట్‌టాపిక్‌గానే సమాధానాలు లేని ప్రశ్నలుగానే చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఏకంగా అనంతపురం రేంజి డిఐజి షిమోషిబాజ్‌పేయి కూడా తిరుపతిలో టోకెన్లుజారీకి ముందే 8వతేదీ రాత్రి తగిన జాగ్రత్తలు తీసుకుని గేట్లు తెరిచారా? లేక విధుల్లో నిర్లక్ష్యంతో గేట్లుతీసి భక్తులను ఒక్కసారిగా వదిలారా అనేది నిశితంగా విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. ఘటనకు సంబంధించి సాంకేతికపరమైన అన్ని సాక్ష్యాలను కూడా సిసి కెమెరాల పుటేజీ, మొబైల్స్‌లో తీసిన వీడియో పుటేజీలు ,ఫోటోలు ఇతర అన్ని రకాల వివరాలను సేకరిస్తున్నామన్నారు. ప్రజలు కూడా తమ వద్ద ఏదేని ఆధారాలు,వీడియోలు ఉంటే దర్యాప్తు అధికారులకు సమర్పించవచ్చని డిఐజి కోరారు. విచారణలో వాస్తవాలు వెలుగుచూస్తాయని ఆమె చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. మరీ ఈ ఘటనకు ఇంకా కారకులెవరనేది మాత్రం త్వరలోనే తేలిపోనుంది. తెలుగురాష్ట్రాలు, తమిళనాడు,కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, ఒరిస్సా ప్రాంతాల భక్తులకు తిరుపతి ఆర్టీసి బస్టాండు సమీపంలోని శ్రీనివాసం, రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఉండే విష్ణునివాసం, అలిపిరి కేంద్రానికి దగ్గరలో భూదేవికాంప్లెక్స్‌లు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన ఐదు కేంద్రాలు కూడా స్థానికులకు అందుబాటులో ఉంటాయి. మరీ బయటి ప్రాంతాల నుండి అంతపెద్దసంఖ్యలో భక్తులు బైరాగిపట్టెడ పాఠశాల కేంద్రంలో గుమికూడటం,ఒక్కసారిగా తోపులాట,తొక్కిసలాట జరగడం వెనుక ఏదేని కుట్రకోణం ఉందా అనే కోణంలో ఇప్పుడు తిరుపతివాసులు వ్యక్తం చేస్తున్న అనుమానాలు బలాన్ని చేకూరుస్తున్నాయి. మరీ నిజానిజాలు సమగ్ర దర్యాప్తులో తేలనున్నాయి.

# పంటలపై ఏనుగుల గుంపు దాడి

### - ఆందోళనలో అటవీ గ్రామ ప్రజలు



లక్ష్మీపురం అడవిలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

బంగారుపాళ్యం, జనవరి 11 ప్రభాతవార్త:

వరుసగా ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. అటవీ పరిసర గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. గత వారం రోజులుగా ఒక ఏనుగుల గుంపు రాగిమానుపెంట అటవీ ప్రాంతంలో తిష్ట వేశాయి. 18 ఏనుగులు వున్న ఈ గుంపు ప్రతి రోజు రాత్రి వేళల్లో పంట పొలాలపై పడి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. సమీప నివాస గృహాల పరిసర ప్రాంతాలవైపు సైతం ఈ ఏనుగుల గుంపు వస్తుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అటవీశాఖ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాగిమానుపెంట అటవీ బీట్ పరిధిలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన రాజగోపాల్, బాబు, ఎత్తిరాజులు తదితర రైతులకు చెందిన అరటి, మామిడి, బొప్పాయి పంటలను ఏనుగుల గుంపు పూర్తిగా ధ్వంసం చేశాయి. ప్రతి రోజు రాత్రి వేళ పంటల వైపు వచ్చే ఏనుగుల గుంపు తెల్లవారుజాము వరకు పొలాల్లోనే తిష్ట వేసి తరువాత అటవి వైపుకు వెళ్ళిపోతున్నాయి. అలాగే వెలుతురుచేను గ్రామంకు చెందిన ఓ రైతు చెరకు పంటను ఏనుగుల గుంపు తొక్కి పడేశాయి. ఈ ఏనుగుల గుంపులో 14 పెద్ద ఏనుగులు, నాలుగు పిల్లలు వున్నట్లు రైతులు గుర్తించారు. పగటి వేళ అడవుల్లో ఈ ఏనుగుల గుంపు సంచరిస్తుండటంతో పశువుల కాపరులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి ఈ ఏనుగుల గుంపును అడవుల వైపుకు మళ్ళించాలని వేడుకుంటున్నారు.

## తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జీ ఎస్పీగా మణికంఠ చందోలు



తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జీ ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న మణికంఠ చందోలు

చిత్తూరు, జనవరి 11 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జీ ఎస్పీగా చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసిలాటలో ఆరు మంది భక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు తిరుపతి జిల్లా ఎస్పీని బాధ్యత చేస్తూ ప్రభుత్వం అక్కడి నుండి ఆయనపై బదిలీ వేటు వేసింది. తిరుపతి జిల్లాకు ఇప్పటి వరకు నూతన ఎస్పీగా ఎవరిని నియమించకపోవడంతో డిజిపి ద్వారకా తిరుమలరావు చిత్తూరు జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న మణికంఠ చందోలును తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జీ ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జీ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.

## స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు నష్టపరిహారం చెల్లించిన టీటీడీ చైర్మన్



తిరుపతి హెల్త్, జనవరి 11 ప్రభాతవార్త :

సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు శనివారం బాధితులకు నష్ట పరిహారం అందజేశారు. స్విమ్స్ డైరెక్టర్ చాంబర్‌లో జరిగిన సమావేశంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, టీటీడీ జేఈవో వి. వీరబ్రహ్మం, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్‌ల సమక్షంలో చెక్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు జి. భానుప్రకాష్‌రెడ్డి, శాంతారామ్, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, పలువురు టీటీడీ స్విమ్స్ అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బోనుపల్లి వద్ద బస్సు బ్రేక్ ఫెయిల్

### తప్పిన ప్రమాదం-50మంది ప్రయాణీకులు సురక్షితం





తొట్టంబేడు, జనవరి 11 ప్రభాతవార్త

మండలంలోని బోనుపల్లి వాగు వద్ద శ్రీకాళహస్తి ఆర్టీసి డిపో బస్సుకు పెను ప్రమాదం తప్పింది. డిపో నుంచి బోనుపల్లికి 50మంది ప్రయాణీకులతో బయలుదేరిన ఆర్టీసి బస్సు బోనుపల్లి కొత్త ఎస్టీ కాలనీ వద్ద వాగులోకి దూసుకెళ్ళింది. డ్రైవర్ గోవిందస్వామి, కండక్టర్‌వెంకటాద్రిలుతో పాటు బస్సులో 50మంది బస్సులో ప్రయాణిస్తుండగా హఠాత్తుగా బస్సు బ్రేక్ ఫెయిల్ కావడంతో పక్కనే ఉన్న వాగులోకి దూసుకెళ్ళడంతో ప్రయాణీకులు హాహాకారాలు చేస్తూ భయాందోళనలకు గురయ్యారు. దీంతో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణీకులు ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం అందుకున్న ఆర్టీసి సిబ్బంది బోనుపల్లి వద్ద ప్రమాదానికి గురైనస్థలానికి చేరుకుని పరిశీలించారు. సమాచారాన్ని సెలవులో ఉన్న డిఎంకు అందించారు. మెకానిక్ ఫోర్‌మెన్ వచ్చి బాగుచేసిన తర్వాత బస్సును బయటకు తీసి డిపోకు తరలించారు.

## జెసిబి యంత్రాలతో ఉపాధి పనులు..

### పట్టించుకోని అధికారులు

వి.కోట, జనవరి 11 ప్రభాతవార్త



జెసిబితో పనులు చేపడుతున్న దృశ్యం

కూలీలకు ఉపాధి కల్పించాల్సిన చోట జెసిబి యంత్రాలతో పనులు చేపట్టి పలువురు నేతలు కూలీల పొట్ట కొడుతున్నారు. తమ కళ్ల ఎదుటే నిబంధనలను తుంగలో తొక్కుతున్నా పట్టించుకోవాల్సిన అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు మిన్నకుండిపోతున్నారు. కొంగాటం పంచాయతీ అట్రపల్లి చెరువు, నెల్లేపల్లి చెరువుల వద్ద పట్టపగలే ఉపాధిహామీ పనులను జెసిబి యంత్రాలతో చేపడుతున్నారు. అయితే ఈ పనులకు సంబంధించి కూలీలతో పనులు చేపట్టినట్లు మస్టర్లలో నమోదు చేయిస్తున్నారు. వారం రోజులుగా ఈ వ్యవహారం జరుగుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. దీంతో చెమట చుక్క చిందించకుండా కొందరు లక్షలు వెనకేసుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

### పల్లెల్లో కయ్యానికి

## కాలు దువ్వుతున్న పందెం కోళ్ళు

### బయట జిల్లా వాసులు శ్రీకాళహస్తి,వెంకటగిరి వైపు మొగ్గు

### పోలీసులకు సవాల్‌గా మారిన కోడి పందెలు



వెంకటగిరిరూరల్ జనవరి 11 ప్రభాతవార్త:

గ్రామీణ ప్రాంతలల్లో సంక్రాంతి పండుగలు దగ్గర పడు కొద్దీ పల్లేలో జోరుగా సంక్రాతి శోభలైన రంగవల్లికలు, గొబ్బెమ్మలు కోడి పందెలుతో పల్లే లో వెలుగులు నిండుకోన్నయి. పడుగులు సందర్భంగా ముఖ్యంగా కోడి పందేలు జోరు మాత్రం అధికం అవుతుందని శ్రీకాళహస్తి మండలంలోని వెంకటగిరి సమీపంగా కోడి పందేం జోరు అధికంగా కావడంతోపాటు డక్కిలి,బాలాయపల్లి మండాలల్లో కోడి పందెలు ప్రతి బుధవారం,ఆదివారం మరి సంక్రాతి పండుగలల్లో అన్ని రోజులు తప్పనిసరిగా లక్షల రూపాయులు పందేలతో జరగనున్నాయి. సరదా కోసం అయితే పర్వలేదుగాని, గంటలల్లో వేల రూపాయలు నుంచి లక్షల రూపాయులు చేతులు మారే అవకాశం వుంది. అదేకాకుండా నెల్లూరు జిల్లా వాసులుతో పాటు కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన ప్రముఖులు కూడా కార్లుల్లో కోడి పందేలు కోసం రావడంతో విశేషం. వెంకటగిరి మండలంలోని జికేపల్లి, కలవలపూడి బాలాయపల్లి మండంలో జయంపు, కోటంబేడు. డక్కిలి మండలంలో కమ్మపల్లి, కుప్పయపాళెం, దేవలపల్లి తదితర ప్రాంతలల్లో పందెం కోళ్ళు జోరు అధికంగా ఉందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైన సంబంధిత పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరతున్నారు.

## కోడి పందెల్లో పాల్గొంటే క్రిమినల్ కేసులు

### - కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరిక



చిత్తూరు, జనవరి 11 ప్రభాతవార్త:

సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఎక్కడైనా ఎవరైనా కోడి పందెలు నిర్వహించడం, వాటిలో పాల్గొని పందెలు కట్టడం చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కోడి పందెలు నిర్వహించడం, పాల్గొనడం చట్టరీత్యా నేరమనే పోస్టర్లను శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ కోడి పందెలు నిర్వహణ, పాల్గొనడం చట్టరీత్యా నేరమని, ఈ చట్టంను ఉల్లంఘించిన వారిపై సెక్షన్-10 ఎపి గేమింగ్ యాక్ట్-1974, సెక్షన్-34 జంతు హింస నివారణ చట్టం-1960 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పశుసంవర్థశాఖ జెడి డాక్టర్ ప్రభాకర్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### రోడ్లపై వ్యాపారాలు

## కొనుగోళ్ళకు కదలి వచ్చిన జనం

### ట్రాఫిక్‌తో సతమతం: గంటల కొద్ది నిరీక్షణం

శ్రీకాళహస్తి, జనవరి 11 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో అధికారుల మధ్య సమన్వయ లోపంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. ఓ వైపు పండగ రద్దీ చోటు చేసుకోగా మరో వైపు నాలుగుమాడా వీధుల్లో పోలీసు ఆంక్షలతో జనం ఎటు వెళ్ళాలో తెలియక తిక మక పడుతున్నారు. శనివారం మధ్యాహ్నం నుంచి అనూహ్యగంగా గ్రామాల నుంచి వచ్చే ప్రజల సంఖ్య పెరిగింది. గతంలో రద్దీ సమయాల్లో ట్రాక్టర్లను పట్టణంలో అనుమతించే వారు కాదు.కానీ నేడు విచ్చల విడిగా ఇసుక ట్రాక్టర్లు పగటి సమయాల్లో రద్దీ సమయాల్లో తిరుగుతున్నాయి. నిబంధనలు పాటించని ఆటోల సంచారంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది.

**నెహ్రూవీది,నగరి వీధుల్లో మాల్‌తో ట్రాపిక్ తిప్పలు:**

శ్రీకాళహస్తి పట్టణంలో సాధారణంగానే నగరి వీధి,నెహ్రూవీధి రద్దీగా ఉంటుంది,ఇక్కడ ఎరువుల దుకాణాలు, బట్టల షాపులు,చెప్పుల దుకాణాలు, డాక్టర్లు ఇలా వ్యాపార కేంద్రాలుగా ఉన్నాయి. రెండు వీధుల్లో బట్టల షాపులు, చెప్పుల దుకాణాల వ్యాపారులు కొనుగోలు దారులకు ఒకటి కొంటే ఒకటి ఉచితం అనే ప్రకటనతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు కదలితరంగాల్లా కదలి వచ్చారు. దాంతో ఇక్కడ ఇసుకేస్తే రాలనంత రద్దీ. ఇక్కడ అసలే చిన్న రోడ్లు ఓ సైడ్ పార్కింగ్‌తో ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేయటంతో రోడ్డుకడ్డంగా మారింది. దీనికి తోడు ఆటోల సంచారం, ట్రాక్టర్ల రాకతో పోలీసులకు ముచ్చెమటలు పట్టాయి. ఇక సాయంత్రం పోలీసులు ట్రాపిక్‌ను నియంత్రించలేని స్థితితో వన్‌వేనుఅమలు చేయాలని నిర్ణయించారు. ఒక వైపు వాహనాలనే అనుమతించారు. పెండ్లిమండపం వద్ద నుంచి వాహనాలను నగరి వీధిలోనుంచి మళ్లించారు., దాంతో ఇక్కడి వ్యాపారాలకు వచ్చే వారి వాహనాల పార్కింగ్ రోడ్డుకడ్డంగా మారింది. పోలీసులు ఈ మార్గం గుండా ట్రాఫిక్‌ను మళ్ళించటంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

### నేలపట్టు, పులికాట్ సరస్సులలో...

# పక్షుల కిలకిలరాగాలు

### 18,19,20వ తేదీలలో ఫ్లెమింగ్ ఫెస్టివల్-2025
### - బీవీపాలెం నందు బోటింగ్





తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్తః

జనవరి నెల కొత్త ఏడాది వచ్చిందంటే దేశ ప్రజలకు సంక్రాంతి పండుగ అయితే ప్రకృతి ప్రేమికులకు మాత్రం ఫ్లెమింగ్ ఫెస్టివల్ ఓ పెద్ద పండుగే అని చెప్పవచ్చు. ఈ పండుగను గత ప్రభుత్వం కరోనాతో నాలుగేళ్ళు కాస్త నిర్లక్ష్యం చేసినప్పటికీ, నేటి ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ ఫ్లెమింగ్ ఫెస్టివల్ పండుగను ఈ ఏడాది రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో జనవరి 18,19,20వ తేదీల్లో మూడు రోజుల పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సూళ్ళూరు పేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి కూటమి నేతృత్వంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఏపీ టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రమణ ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారి జనార్ధన్‌రెడ్డి, డీఎఫ్‌వో వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ రాధిక, డీవీఎం శ్రీనివాసరావు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధుల సారథ్యంలో ఈ పండుగ ఈ ఏడాది అంగరంగ వైభవంగా జరగబోతోంది.నేల పట్టు పక్షుల అభయారణ్యం నందు ఉన్న విలక్షణ, పర్యావరణ నైవిద్యం కారణంగా గ్రేపెలికాన్ పక్షులు, కార్మోనెట్ బిల్ పక్షులు (నీటి కాకులు), స్పూన్ బిల్ స్టాక్ పక్షులు, ఓపెన్ బిల్ స్టాక్ పక్షులు, తదితర అరుదైన పక్షులు నేలపట్టు అభయారణ్యానికి రావడం జరుగుతోంది. వలస పక్షులు సౌత్ ఈస్ట్ ఆసియా సుదూర విదేశీ ప్రాంతాల నుంచి వచ్చి వాటి సంతతిని పెంపొందించుకుని తిరిగి సొంత ప్రాంతాలకు వెళ్తాయి. ఫ్లెమింగ్ పక్షులు ఆహారం కోసం వలస వచ్చి సొంత ప్రాంతాలకు తిరిగి వెళ్ళిపోతాయి. దాదాపు 200 రకాల ఈ విలక్షణ పక్షులను సందర్శించడానికి విజ్ఞానాన్ని పెంపొందించుకొనడానికి వీలుగా నేలపట్టు పక్షుల వీక్షణ, ఆలకాని తిప్ప పులికాట్ పక్షుల రక్షిత కేంద్రం వీక్షణ పాయింట్ల నందు ఫ్లెమింగ్ పక్షుల వీక్షణ ఏర్పాటు బీవీపాలెం నందు బోటింగ్ ఏర్పాటు, శ్రీసిటీ నందు పర్యావరణ వైవిధ్య అంశాలపై ఏకో ఫ్రెండ్లీ బయో డైవర్శిటీ అంశాలపై ఇప్పటికే తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పూర్తి ప్రణాళికలు రూపొందించారు. దేశ, విదేశాల నుంచి టూరిస్టులు, ప్రజలు, పక్షుల ప్రేమికులు, మహిళలు, యువత, తిరుపతి జిల్లా ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు,తిరుపతి జిల్లా ప్రజలు, స్థానికులు సద్వినియోగం చేసుకుని నేలపట్టు, పులికాట్ సరస్సు అందాలను స్వాగతించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు.

మరిన్ని వివరాలతో...2 భాగంలో

## పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

-పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్



**తవణంపల్లె, జనవరి 11 ప్రభాతవార్త:** పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. మండల కేంద్రం తవణంపల్లెలో ఉపాధి హామీ పథకం కింద పాడి రైతు మురుగేశ్ శెట్టి నిర్మించిన గోకులం (పశువుల షెడ్)ను గోమాతలకు మేత అందించి ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించడానికే కూటమి ప్రభుత్వం గోకులంలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. వీటి నిర్మాణంతో బడుగు, బలహీన వర్గాలు, సన్న, చిన్నకారు రైతుల కుటుంబాల్లో ఆర్థిక ప్రగతి కలుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు వెంకటేష్ చౌదరి, దిలీప్‌నాయుడు, మధుకుమార్, ఒడ్డుపల్లె భాస్కర్‌నాయుడు, కోదండయ్య, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకోదండరామాలయంలో ఘనంగా చక్రస్నానం

తవణంపల్లె, జనవరి 11 ప్రభాతవార్త:



మండలంలోని అరగొండలో వెలసిన శ్రీకోదండ రామ స్వామి దేవస్థానంలో శనివారం చక్రస్నానం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయంలో శుక్రవారం నుండి వైకుంఠ ఏకాదశి పండుగ పర్వదినం వేడుకలను నిర్వహిస్తున్న విషయం విధితమే. ఇందులో భాగంగా శనివారం చక్రస్నానం, గ్రామోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఉదయం ఆలయంలో శ్రీసీతా లక్ష్మణ సమేత కోదండరాములుస్వాముల వారి మూలవిరాట్‌కు ఉదయం ఆలయ అర్చకులు ప్రసాద్ స్వామి శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ మండపంలో వుంచి ఉత్తర ద్వార దర్శనం సందర్భంగా ఏర్పాటు చేసిన కలశాలలోని పవిత్ర జలంతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈచక్రస్నానంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకపల్లకిపై వుంచి ఊరేగించారు. ఉత్సవ ఉభయదారులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

రామకుప్పం, జనవరి 11 ప్రభాతవార్త



రైతుల అభ్యున్నతికి ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మణీ ంద్రం గ్రామంలో ప్రభుత్వం రైతులకు రాయితీతో మంజూరు చేసిన గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం బిందు సేద్యం, వ్యవసాయ పనిముట్లు, బ్యాంకు రుణాలు, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందిస్తోందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఒ రవికుమార్, మంజునాథరెడ్డి, వెంకటరమణ, శ్రీరాములురెడ్డి, రామలింగారెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమయంలో వడ్డే ఓబన్న కీలకపాత్ర

చిత్తూరు, జనవరి 11 ప్రభాతవార్త:



దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో వడ్డే ఓబన్న కీలక పాత్ర పోషించారని జిల్లా బిసీ సంక్షేమశాఖ అధికారి రబ్బానీ భాషా అన్నారు. వడ్డే ఓబన్న జయతి పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్‌హాలులో శనివారం వడ్డే ఓబన్న చిత్రపటానికి జిల్లా బిసీ సంక్షేమశాఖ అధికారి రబ్బానీ భాషా పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమలో కలెక్టరేట్ ఎఓ కులశేఖర్, బిజెపి నాయకులు అట్లూరి శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ నాయకులు షణ్ముగం, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు సంక్షేమం కోసం పలు పథకాలు



**చిత్తూరు, జనవరి 11 ప్రభాతవార్త:** రైతు సంక్షేమం కోసం సిఎం నారా చంద్రబాబునాయుడు పలు పథకాలను చేపట్టి అమలు చేస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. యాదమరి మండలం 184 గొల్లపల్లి గ్రామంలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ నూతనంగా నిర్మించిన గోకులం షెడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ రైతు సంక్షేమానికి కట్టుబడి పని చేస్తోందన్నారు. ఒక్కొక్క రైతుకు 2 లక్షల రూపాయల వరకు ఉపాధి హామీ పథకంలో షెడ్లు మంజూరు చేసే కార్యక్రమానికి సిఎం నారా చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొరార్జీ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌రబ్బీ, జిల్లా తెలుగుదేశం కార్యదర్శి హేమగిరినాయుడు, రాష్ట్ర తెలుగుదేశం నాయకుడు అమరనాధనాయుడు, ఎంపిడిఒ వేణ, తహసిల్దారు పార్థసారధి, యాదమరి పశువైద్యశాఖ డాక్టర్ సంధ్య, ఉపాధి ఎపిఒ బాల తదితరులు పాల్గొన్నారు.

## కోడిపందెలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పాలసముద్రం, జనవరి 11 ప్రభాతవార్త:

సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలో ఎవరైనా ఎక్కడైనా కోడి పందెలు, జూదం వంటి ఆసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చిన్నరెడ్డప్ప హెచ్చరించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా అత్యధిక ప్రాంతాల్లో కోడి పందెలు, జూదం నిర్వహించడం అనవాయితీగా వస్తుందని, మండల పరిధిలో ఎక్కడైనా ఇలాంటి అసాంఘీక కార్యక్రమాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## జిల్లా వైకాపా ప్రధాన కార్యదర్శిగా రజనీకాంత్

గుడిపాల, జనవరి 11 ప్రభాతవార్త:

జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా గుడిపాల మండలం వసంతాపురం సర్పంచ్ ఎన్ఎస్ రజనీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు వైకాపా అధిష్టానం నుండి నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనపై నమ్మకం వుంచి పార్టీ అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతలను పక్కాగా నిర్వహిస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకారం అందించిన చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటింటీ పూజలందుకొన్న ఆదిదంపతులు

చౌడేపల్లి, జనవరి 11 ప్రభాతవార్త



ఆదిదంపతులైన సీతారాములు శనివారం పట్టణంలో ప్రతి ఇంటినుంచి పూజలందుకొన్నారు. ద్వాదశిని పురస్కరించుకొని స్థానిక కమలాంజనేయస్వామి ఆవరణంలోని సీతాలక్ష్మణా, ఆంజనేయ సమేత రాములవారి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించారు. వినాయకయూత్, గ్రామస్తుల ఆధ్వర్యం లో బస్టాండు నుంచి బజారు, గాంధీ, శివాలయం, పాతబస్టాండు, సంతగేటుల్లో స్వామివార్లను ఊరేగించారు. ఆలయ ప్రధానార్చకుడు వశిష్టాచార్యులు, వినాయకయూత్ సభ్యులు పిల్లారి జీవన్‌ప్రకాష్, గణేష్, లీలాకుమార్‌నాగ్, కడియాల మహేష్, కళ్యాణ్‌భరత్, గందోడి చరణ్ రాయల్, నన్నా కుమార్, భాస్కర్, గందోడిప్రవీణ్‌కుమార్, తుంగా రమేష్, గందోడి సాయికిరణ్, శబరీష్, రాజన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పండగలు సంస్కృతి..సంప్రదాయాలకు ప్రతీకలు

కుప్పం, జనవరి 11 ప్రభాతవార్త



పండగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. శనివారం కుప్పం డిగ్రీ కాలేజ్‌లో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలకు బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భోగి, సంక్రాంతి, కనమ రోజుల్లో ముఖ్యఘట్టాలైన భోగిమంటలు, భోగిపళ్లు పోయడం, పొంగలి చేయడం, గోపూజ నిర్వహించారు. కాలేజ్ ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం కాలేజ్ ఆవరణలో రంగవల్లుల పోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ సుధారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వి.కోటలో ఘనంగా వడ్డె ఓబన్న జయంతి వేడుకలు



వి.కోట, జనవరి 11 ప్రభాతవార్త

వడ్డెర సంఘం నేత ఎండిహెచ్ పవన్ కళ్యాణ్ అధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు వి.కోటలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్‌లో ఓబన్న చిత్రపటానికి పూజలు చేసి కేక్ కట్ చేశారు. వక్తలు మాట్లాడుతూ వడ్డే ఓబన్న సేవలను వివరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ రామచంద్రనాయుడు, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, గాండ్లపల్లి సుబ్బన్న, పునీత్, గోవిందస్వామి, రామకృష్ణ, రాము, బాలు, చలపతి పాల్గొన్నారు.

## తెదేపా కార్యకర్త కుటుంబానికి 3.60లక్షల ఆర్థిక సాయం

శాంతిపురం, జనవరి 11 ప్రభాతవార్త



మండలంలోని నక్కనపల్లి గ్రామంకు చెందిన తెదేపా కార్యకర్త కార్తీక్ కుటుంబానికి ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ 3.60లక్షల చెక్కును అందజేశారు. కార్తీక్ కుమారుడు హన్వీష్ అనారోగ్యంతో బాధపడేవాడు. ఈనేపథ్యంలో అతని వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం చంద్రబాబునాయుడు 3.60లక్షలు మంజూరు చేశారు. అయితే హన్వీష్ అకస్మాత్తుగా మృతి చెందాడు. దీంతో అతని మృతదేహానికి ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ నివాళులు అర్పించి కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, సర్పంచ్ జనార్ధనరెడ్డి, నేతలు చంద్రారెడ్డి, రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు ఇరవైమంది ఎంపిక

కుప్పంరూరల్, జనవరి 11 ప్రభాతవార్త



కుప్పం లయన్స్‌క్లబ్, పిఇఎస్ ఆస్పత్రి అధ్వర్యంలో కుప్పంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. మొత్తం అరవై మంది కంటి సమస్యలతో బాధపడేవారు హాజరు కాగా వారికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి ఇరవై మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్, కోశాధికారి చరణ్, సభ్యులు పిజి సెల్వం, శివ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## భారతీయ సనాతన వారధి సంక్రాంతి

పుంగనూరు, జనవరి 11, ప్రభాతవార్త



సనాతన ధర్మానికి మూలమైన భారతదేశం లో సనాతన భారతిగా మకర సంక్రాంతి పండుగ యుగయు గాలుగా పరిఢవిల్లు తోందని వారాహి గ్రూప్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు హేమంత్ రాయల్ అన్నారు. వారాహి గ్రూప్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా పట్టణంలోని బిఎంఎస్ క్లబ్ ఆవరణంలో మహిళలకు శనివారం ముగ్గుల పోటీల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాను 30 మంది మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. ఇందులో విజేతలైన మహిళలకు మొదటి రెండవ , మూడవ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో వారాహి గ్రూప్స్ ఫౌండర్ హేమంత్ రాయల్, వారాహి గ్రూప్ మెంబర్స్ వరలక్ష్మి, రాఘవి, జయలక్ష్మి పావన, త్రిలోక్, శ్రీనిధి, మోనిక తదితరులు మహిళలు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో రాష్ట్రఎన్నికల కమీషన్ ముఖ్య కార్యదర్శి

కాణిపాకం, జనవరి 11 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమీషన్ ముఖ్య కార్యదర్శి చక్రవర్తి శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే కుటుంబసమేతంగా స్వామివారి ప్రత్యేక అభిషేకంలో పాల్గొన్నారు. వారి వెంట సూపరెండెంట్‌లు వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, రవి, ఐరాల తహశీల్దార్ మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పేదల ఆరోగ్యంపై సిఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ

– ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం, జనవరి 11 ప్రభాతవార్త** పేదల ఆరోగ్యం పట్ల సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసు కుంటున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల కార్యాలయంలో నాలుగు మండలాల పరిధిలోని 150మందికి రూ 3 కోట్ల రూపాయల మేర ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంతో కలసి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా సిఎం చంద్రబాబునాయుడు ఈ ఏడు నెలల కాలంలోనే ఒక్క కుప్పం నియోజకవర్గంలోనే దాదాపు 6కోట్ల మేర సిఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరు చేశారన్నారు. ఇతర నియోజకవర్గాలకు మరింత తక్కువగా మంజూరైందన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజల ఆరోగ్యంకు సంబంధించి టాటా కన్సల్టెన్సీ సర్వీస్ (టిసిఎస్) వారితో సైతం సిఎం చంద్రబాబు చర్చించారన్నారు. మున్ముందు అన్ని రకాల ఆస్పత్రులను అనుసంధానం చేసి ప్రతి మూడు నెలలకు ఓ సారి కుప్పం ప్రజల ఆరోగ్యంపై రక్తపరీక్షలు నిర్వహించి సమగ్ర సమాచారం సేకరించడంతో పాటు వారికి అవసరమైన వైద్య సేవలు అందించేందుకు సిఎం చంద్రబాబు నిర్ణయించారన్నారు. ఆర్డీఓ శ్రీనివాసులురాజు, రాష్ట్ర నేతలు డా॥ సురేష్‌బాబు, గోపీనాథ్, డా॥ వెంకటేష్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, విశ్వనాథనాయుడు, ఆనందరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, నేతలు సత్యేంద్రశేఖర్, జాకీర్, ఆర్ముగం, ప్రతాప్, నాలుగు మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర యుద్ధ వీరుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలు

పలమనేరు, జనవరి 11, ప్రభాతవార్త:



పలమనేరులో ఘనంగా స్వాతంత్ర సమర యుద్ధ వీరుడు వడ్డె ఓబన్న 218వ జయంతి వేడుకలను వడ్డెర సంఘం నాయకులు నిర్వహించారు. స్థానిక టి.వడ్డూరు వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు స్వతంత్రబాబు మాట్లాడుతూ స్వాతంత్ర సమర యుద్ధ వీరుడైన వడ్డె ఓబన్నను కూటమి ప్రభుత్వం గుర్తించి ఆయన జయంతి వేడుకలను నిర్వహించడం హర్షనియ్యమన్నారు. టి.వడ్డూరులో వడ్డె ఓబన్న విగ్రహం ఏర్పాటు కోసం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కోరడం జరిగిందని త్వరలో విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడిన తమను ప్రభుత్వం గుర్తించి తమ కుల వృత్తిలో బలపడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

## కర్నాటక మద్యం పట్టివేత -ఒకరి అరెట్టు

పలమనేరు, జనవరి 11 ప్రభాతవార్త:



కర్నాటక మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు..బైరెడ్డిపల్లె మండలం గంగినాయ నపల్లె పంచాయితీ కొత్త ఇండ్లుకు చెందిన సాతాని కృష్ణప్ప (57)గ్రామ సమీపంలోని బస్టాప్ వద్ద అక్రమంగా కర్నాటకమద్యంవిక్రయిస్తుండగాఅదుపులోకి తీసుకుని ఆతని వద్ద నుండి 50 కర్నాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించామని తెలిపారు.

## కోడి పందాలు జూదం కోసం అడిగితే క్రిమినల్ కేసులు

పూతలపట్టు, జనవరి 11, ప్రభాతవార్త

కోడిపందాలు జూదం కోసం నిర్వహించుట, పాల్గొనుట చట్ట రీత్యా నేరమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై సెక్షన్ 10 గేమింగ్ యాక్ట్ 1974 సెక్షన్ 34 జంతు హింస నివారణ చట్టం 19, 60 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోబడునని సిఐ కృష్ణ మోహన్ సూచించారు. ప్రతి ఏడాది సంక్రాంతి పర్వదిన మూడు రోజులు పాటు కోడిపందాలు రకరకాల జూదాలు అక్కడే లిక్కర్ అమ్మకాలు కూడా జోరుగా నిర్వహించే దళారులకు పోలీసులు గట్టిగా చెక్ పెట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. అసభ్యకర నృత్యాలు, జూదాలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు హెచ్చరిక ఫ్లెక్సీలను కూడా అక్కడక్కడ ఏర్పాటు చేశారు.

## ఆపదలో వున్న ఆత్మీయులను పరామర్శించిన మాజీ మంత్రి



**చౌడేపల్లి, జనవరి 11 ప్రభాతవార్త** ఆపదలో వున్న ఆత్మీయులను మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి లుపరామర్శించారు. మండలంలోని 29ఎ. చింతమాకులపల్లికి చెందిన జగజ్జీవన్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అదే విధంగా పంచాయతీ కేంద్రం పుదిపట్లలో మోహన్‌రెడ్డి ఇటీవల గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స చేయించుకొన్నాడు. వారిద్ద రినీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి మిథు న్ రెడ్డిలు పరామర్శించారు. జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, మండల ఉపాధ్యక్షులు నరసింహు లు యాదవ్, సుధాకర్‌రెడ్డి, మాజీ బోయకొండ ఛేర్మన్ మిద్దింటి శంకరనారాయణ, మాజీ ఎంపిపి రుక్మి ణమ్మ, యువజన నేతలు మిద్దింటి కిషోర్, కళ్యాణ్ భరత్, నాగభూషణంరెడ్డి, సర్పంచులు హైమావ తిర వికుమార్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, ఓబులేసు, లక్ష్మీదేవిబాబు, చౌడేపల్లి ఉపసర్పంచు అల్తాఫ్ వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడుగా నడింపల్లి దామోధర్‌రాజు

**చౌడేపల్లి, జనవరి 11 ప్రభాతవార్త**

వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడుగా చౌడేపల్లి జడ్పీటీసీ సభ్యుడు నడింపల్లి దామోధర్‌రాజు నియమితులయ్యారు. ఈమేరకు వైకాపా కేంద్రీయ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఆది నుంచి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి విధేయుడుగా వుంటున్న నడింపల్లి దామోధర్‌రాజు జిల్లా వైకాపా ఉపాధ్యక్ష పదవి లభించడం పట్ల ఆపార్టీ శ్రేణుల్లో ఆనందోత్సవాలు నెకొన్నాయి. అదే విధంగా నియోజకవర్గ కార్యనిర్వహణా కార్యదర్శిగా పుదిపట్లకు చెందిన ఉదయ్ కమార్‌రెడ్డి నియమితులయ్యారు

# తిరుపతి డివిజన్

## ముందస్తు సంక్రాంతి వేడుకలు

గుడిపాల, జనవరి 11 ప్రభాతవార్త:



గుడిపాల సిఎన్ఆర్ విద్యాసంస్థల్లో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల, కళాశాలలను ప్రత్యేకంగా అలంకరించి భోగి మంటలు, బసవన్నలను ఏర్పాటు చేశారు. కళశాల వ్యవస్థాపకులు లోకేష్‌రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి తెలుగువారి పండుగ అని తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోడి పందెలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ మణికంఠ చందోలు హెచ్చరిక

చిత్తూరు, జనవరి 11 ప్రభాతవార్త:



జిల్లాలో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఎక్కడైనా కోడి పందెలు, జూదం నిర్వహించడం, సాంప్రదాయక క్రీడల పేరుతో ఆసాంఘీక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మణికంఠ చందోలు హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సాంప్రదాయాలకు ప్రతీక అని, ఈ పండుగను కుటుంబసభ్యులతో కలిసి ఆనందోత్సవాలతో సాంప్రదాయమైన క్రీడలకు ప్రాధాన్యమిస్తూ జరుపుకోవాలన్నారు. కోడి పందెలు, జూదాలు వంటి కార్యక్రమాలు మన సంస్కృతి, సమాజంను దెబ్బతీయడమే కాకుండా ఎన్నో కుటుంబాల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా కోడి పందెలు నిర్వహించినా, పందెలు నిర్వహించడానికి స్థలాలు, భూములు ఇచ్చినా, జూద క్రీడలు నిర్వహించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా కోడి పందెలు, జూదం, ఇతర అసాంఘీక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ నెం.100 లేదా డయల్ నెం.112కు సమాచారం అందించాలని, అలాగే పోలీసు వాట్సాప్ నెం.94409 00005కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను పోలీసు శాఖ గోప్యంగా వుంచడం జరుగుతుందన్నారు.

## ఘనంగా సిఆర్ రాజన్ జన్మదినం

గుడిపాల, జనవరి 11 ప్రభాతవార్త:



జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్ జన్మదినంను గుడిపాలలో శనివారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు కేక్ కట్ చేసి తెలుగు దేశం నాయకులు, కార్యకర్తలకు పంచి పెట్టారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంకు వెళ్ళి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు సిఆర్ రాజన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సుమతిమురళీ, తెలుగుదేశంనాయకులు గోవిందగౌడ్, పయణి, శంకర్, అర్జున్, గుణశేఖర్, ముత్తు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా ఎస్పి సుబ్బారాయుడు బదిలీని నిలపాలి

తిరుపతి క్రీడ, జనవరి 11, ప్రభాతవార్త

గంజాయి బ్యాచ్, భూకబ్జాదారులు, రౌడీయిజం అన్నింటిని తనదైన శైలిలో పరిష్కరిస్తూ తిరుపతిని, తిరుపతి జిల్లాను ప్రశాంతంగా ఉంచడంలో ప్రధాన పాత్ర పోషించినటువంటి తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడుని తిరుపతిలో క్యూ లైన్‌లో మొన్న జరిగినటువంటి దుర్ఘటన కారణంగా చూపి బదిలీ చేయడం బాధాకరం.. ఈ దుర్ఘటన జరగడానికి ముఖ్య కారణంలో ప్రధాన కారణం పార్కులో లైటింగ్ లేకపోవడం, అలాగే అస్వస్థకు గురైనటువంటి వారిని వెనుక గేటు నుంచి కాకుండా ప్రధాన గేటు నుంచి బయటకు తీసుకురావాలని ఆలోచన పెను ప్రమాదానికి కారణమైంది. దీనికి ఎస్పీని ప్రధాన బాధితులు చేస్తూ బదిలీ చేయడం అనేది బాధాకరం, ఇప్పుడిప్పుడే తిరుపతి జిల్లాలో అరాచకాలు అన్ని తగ్గి ప్రశాంతత ఏర్పడుతున్న సమయంలో ఎస్పీ బదిలీ అనేది మళ్లీ తిరుపతి జిల్లా ఏ విధంగా మారుతుందో అని ఆందోళన కలిగిస్తోంది. కావున సమగ్రమైన విచారణ జరిపించి అసలైన దోషులను వారికి తగశిక్ష విధించాలని తిరుపతి ఎస్పీని తిరిగి తిరుపతి జిల్లా ఎస్పీగా నియమించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్‌ని హోం శాఖ మంత్రి తిరుపతి ప్రజలుగా ప్రాధేయపడుతున్నామన్నారు. అధ్యక్షులు, సనాతన ధర్మ పరిరక్షణ సమితి కార్యదర్శి చీనేపల్లి కిరణ్ కుమార్, జెన్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అకాడమి, స్పోర్ట్స్ క్రీడాకారులు విద్యార్థులు కోరుతున్నారు.

## జిల్లా వైకాపా ఉపాధ్యక్షుడిగా గురువారెడ్డి



శ్రీరంగరాజపురం, జనవరి 11 ప్రభాతవార్త:

జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఎస్ఆర్ పురం మాజీ జడ్పీటిసీ గురువారెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనపై నమ్మకం వుంచి జిల్లా పార్టీ ఉపాధ్యక్ష పదవి ఇచ్చిన మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి తాను జీవితాంతం రుణపడి వుంటానన్నారు. క్షేత్ర స్థాయిలో నాయకులు, కార్యకర్తలను కలుపుకుని నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి అహర్నిశలు కృషి చేస్తానని ఆయన ప్రకటించారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించిన జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి, చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## గోకులంతో పాడి అభివృద్ధి

– ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్

బంగారుపాళ్యం, జనవరి 11 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న గోకులం పథకం ద్వారా పాడి అభివృద్ధి చెందుతుందని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నా రు. శనివారం మండలంలోని వేపనపల్లి, రాగిమానుపెంట గ్రామాల్లో ఏర్పాటు చేసిన గోకులం షెడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. బంగారుపాళ్యం మండలానికి 120 గోకులం యూనిట్లు మంజూరు కాగా ఇప్పటికే 45 గోకులం షెడ్లు పూర్తి అయినట్లు పశుసంవర్ధకశాఖ జెడి డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు బాలకృష్ణమనాయుడు, మోహన్‌బాబులు, మండల టిడిపి అధ్యక్షులు ఎన్‌పి జయప్రకాష్, కార్యదర్శి జనార్ధన్‌గౌడు, ఇన్‌ఛార్జీ ఎంపిడిఓ శ్రీధర్, ఇజిఎస్ పిడి రవికుమార్, ఎపిడి రవికుమార్, ఎపిఓ కిరణ్, పలువురు టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## నగరి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

### ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్

**పుత్తూరు, జనవరి 11 ప్రభాతవార్త :**



నగరి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తెలిపారు. శనివారం మండలంలోని ఎగువ గూలూరు దళితవాడలో రూ. 14.40 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, రూ. 2.30 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో గ్రామీణ రోడ్ల నిర్లక్ష్యానికి గురయ్యాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. రూరల్ మండలంలోని అన్ని పంచాయతీల్లోని గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే రాక సందర్భంగా స్థానికులు కొత్తగా నిర్మించిన సిమెంట్ రోడ్లపై ముగ్గులు వేసి ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవయ్య తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## వడ్డే ఓబన్న గొప్ప స్వతంత్రం సమరయోధుడు..



**రేణిగుంట ఫిబ్రవరి 11 ప్రభాతవార్త**

రేనాటి వీరుడిగా ప్రఖ్యాతిగాంచి బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన సైరా ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి మిత్రుడైన వడ్డే ఓబన్న గొప్ప స్వాతంత్ర యోధుడని తిరుపతి జిల్లా వడ్డెర ప్రధాన కార్యదర్శి దేవల్ల రమణ అన్నారు. రేణిగుంట పట్టణంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలు దేవల్ల రమణ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. 39 ఏళ్ల వయసు లేని ఓబన్న దేశం కోసం వీర మరణం పొందారని అన్నారు. ఓబన్న జయంతి ఉత్స వాలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాయలసీమ అధ్యక్షులు శ్రీనివాసులు, చంద్రగిరి జ్యోతి, ఒంటిమిట్ట కిరణ్, చల్ల రమణ, కోట కొమ్మల దొరస్వామి, చంద్రగిరి సుబ్రహ్మణ్యం, రేణిగుంట టిడిపి సీనియర్ నాయకులు డి పుష్ప నాదం, పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా, మాజీ సర్పంచ్ జ్యోతి నారాయణ, పవన్, సుమన్, కన్నన్ రెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## కోడిపందాలు, జూదాలు ఆడితే కఠిన చర్యలు - ఎస్ఐ

**కేవీబీ పురం, జనవరి 11 ప్రభాతవార్త:**

తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పుత్తూరు డీఎస్పీ పర్యవేక్షణలో కేవీబీ పురం ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో కేవీబీ పురం మండలంలో సంక్రాంతి సందర్భంగా కోడి పందాలు, పేకాట, ఇతర జూదాలు ఆడే వారిపై ప్రత్యేకంగా నిఘా పెట్టడంజరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడి పందాలు, జూదాలు ఆడి కుటుంబాల్లో బాధనింపవద్దని అలా చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అదే విధంగా ముఖ్యంగా విద్యార్థులకు పిల్లలకు, యువతకుసెలవుల్లో సరదాల కోసం ఆహ్లాదం కోసం చెరువులు నిండిన వాగులు వంకల్లో, బావుల్లోకి ఈతకు వెళ్లి ప్రమాదాలకు గురికాకూడదని పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై నిఘా పెట్టాలని తెలిపారు.

## ఘనంగా శని మహా ప్రదోష పూజలు

**సత్యవేడు, జనవరి 11 ప్రభాతవార్త:**



నాగలాపురం మండలం సురుటుపల్లిలో శనివారం జరిగిన మహా ప్రదోష పూజలు ఘనంగా జరిగింది. ఈ ప్రదోష పూజల్లో ఎమ్మెల్యే ఆదిమూలం, శ్రీసిటీ ఎండీ రవీంద్రసన్నారెడ్డిలు పాల్గొని స్వామివారి సేవలో తరించారు. శివపార్వతుల ప్రాకార ఉత్స వంలో స్వామి, అమ్మవార్ల పల్లకిసేవలో ఎమ్మెల్యే, శ్రీసిటీ ఎండీలు పాల్గొని పల్లకిని మోస్తూ తన్మ యత్వం చెందారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలుకగా, ఈవో లత ఆలయ మర్యాద చేసి ఘనంగా సత్కరించారు.

## పాలనను చూసి ఓర్వలేక శవ రాజకీయాలు చేస్తున్నారు

**తిరుపతి విద్య జనవరి 11 ప్రభాత వార్త:**



ప్రజాపాలనను చూసి ఓర్వలేకనే వైసిపి నాయకులు ఆంధ్ర రాష్ట్రానికి సేవకుడిగా పనిచేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని మాజీ సర్పంచ్ తెలుగుదేశం పార్టీ మహిళా నేత మమత మండిపడ్డారు. శనివారం ఆమె కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ నాయకులు పనికట్టుకొని కూటమి ప్రభుత్వంపై బురదచల్లటం మానుకోవాలన్నారు.

## డొమెస్టిక్ పైప్ నేచురల్ గ్యాస్ సురక్షితం

### – నేడు ఏజీ అండ్ పీ గ్యాస్ వారి కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరు

**తిరుపతి కలెక్టరేట్, జనవరి 11 ప్రభాతవార్త**

త్రిరుపతి జిల్లాకు ఆదివారం రోజు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు రానున్నారని పట్టణంలో ఏజీ అండ్ పి గ్యాస్ వారి కార్యక్రమంలో పాల్గొననున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఏజీ అండ్ పి ప్రథమ్–థిక్ గ్యాస్ వారు తిరుపతి జిల్లాలో డొమెస్టిక్ పైప్ న్యాచురల్ గ్యాస్ అనగా గృహపసరాలకు పైప్‌లైన్ ఏర్పాటుతో వినియోగదారుల గృహాలకు సహజ గ్యాస్ అందించడం అని దానిని గృహాలకు, పరిశ్రమలకు కూడా వారు అందిస్తున్నారన్నారు. సదరు కంపెనీ వారి ఆహ్వానం మేరకు తిరుపతి జిల్లాకు సీఎం చంద్రబాబు విచ్చేయుచున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వినియోగదారులతో సీఎం ముఖాముఖి నిర్వహించి తర్వాత తాజ్ హోటల్‌కి వెళ్ళి అక్కడ ఈ న్యాచురల్ గ్యాస్‌తో నడిచే వాహనాలు 2,3,4 వీలర్స్‌ను సుమారు ఒక 65 నుంచి 70 వరకు సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేపట్టనున్నారని తెలిపారు. అటు పిమ్మట తాజ్ లోపల ఏజీ అండ్ పి వాళ్ళతో కలిసి ఇన్వెస్ట్ చేయబోతున్న కొంత మంది జపనీస్ ఇన్వెస్టర్లతో మీటింగ్ జరిపి, ఇతర పారిశ్రామిక వేత్తలతో ఒక సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

## గోవిందనామస్మరణతో మార్మోగిన కల్యాణవేంకన్న ఆలయం..!

### ద్వాదశి ద్వారా ప్రవేశానికి తరలివచ్చిన భక్తులు

**నారాయణవనం, జనవరి 11, ప్రభాతవార్త**

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకోని మరుసటి దినమైన శనివారం ఉదయం నారాయణవనంలో వెలసిన పద్మావతీదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని ఆలయంలో ఉత్తర ద్వాదశి ద్వారం ప్రవేశానికి వేలసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం 8గంటలకు శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణవేంకటేశ్వరున్ని ఆలయంలోనే శ్రీవారిని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణవేంకటేశ్వరున్ని తిరుచ్చివాహనంపై అధిరోహించి ఊరేగించారు. అక్కడ నుంచి ఉత్తర ద్వాదశి ద్వార ం వద్దకు అమ్మవార్లను, స్వామివారిని తీసుకొచ్చి సర్కారుహారతి ఇచ్చిన తర్వాత భక్తులకు ద్వాదశి ద్వారా ప్రవేశం కల్పించారు. ద్వాదశి ద్వారం చేసుకున్న వారిలో రెడ్డి, మాజీ మంత్రి రోజా, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు కల్పించారు.

## జిల్లావైకాపా కార్యదర్శిగా శంకరప్ప నియామకం.

**పెద్దపంజాణి,జనవరి11,ప్రభాతవార్త:**



చిత్తూరుజిల్లా వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ జిల్లాకార్యదర్శిగా బట్టందొడ్డిపంచాయతీకి చెందిన వైకాపా సీనియర్ నాయకుడు శంకప్పను నియమిస్తూ కేంద్రపార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది.ఈ సందర్భంగా శంకరప్ప మాట్లాడుతూ తనపైనమ్మకంతో జిల్లాపార్టీలో కార్యదర్శిగా బాధ్యలు అప్పజెప్పడంపట్ల ఆయన హర్షంవ్యక్తంచేశారు.పార్టీఅధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి,జిల్లాపార్టీ అధ్యక్షుడు భూమణకరునాకర్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ల సూచనలమేరకు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి శక్తివంచనలేకుండా కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు.పార్టీని జిల్లాలో మరింతబలోపేతం చేయడంతోపాటు కార్యకర్తలకు అన్నివిధాలా అందుబాటులో ఉంటామన్నారు.ప్రజాసమస్యలపై పార్టీతరపున పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు.కాగా జిల్లాకార్యదర్శిగా శంకరప్ప నియామకంపట్ల మండల వైకాపా శ్రేనులు హర్షం వ్యక్తంచేశారు.

## పర్యవేక్షణ లోపం:శ్మశానికి శాపం



**శ్రీకాళహస్తి,జనవరి 11 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి ప్రజల సౌకర్యార్థం లక్షలు వెచ్చించి నిర్మించిన హిందూ శ్మశానం సమీపంలో స్వర్ణముఖి నదిలో శవాలు పూడ్చటానికి కూడా వీలులేని దుస్థితి చోటు చేసుకుంది. ఓ వైపు ఇసుకాసురులు తమ ధన ధాహం కోసం నదిని తొలిచేస్తుండగా మరో వైపు పర్యవేక్షణ లేకుండా ముళ్ళ చెట్లు పిచ్చి మొక్కలు పెరిగి అడుగుపెట్టడానికి కూడా వీలులేని స్థితి చోటు చేసుకుంది. ఈ నేపధ్యంలో శనివారం మాజీ ధర్మకర్తల మండలి అంజూరు తారక శ్రీనివాసులు ఇక్కడ పర్యటించి పరిశీలించారు. యువత శ్రమ దానంతో నదిని శ్మశాన వాటికను పరిశుభ్రం చేసారు. పర్యవేక్షించాల్సిన మున్సిపల్,ఇరిగేషన్ శాఖలు పట్టించుకోక పోవటం దారుణమన్నారు.

## 15న గిరిప్రదక్షిణం

**శ్రీకాళహస్తి,జనవరి 11 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరుని గిరి ప్రదక్షిణ ఉత్సవం ఈ నెల 15 బుధవారం నిర్వహించబడుతుందని ఆలయాధికారి టి.బాపిరెడ్డి శనివారం ప్రకటించారు. ఇక్కడిఆలయంలో నిర్వహించే ప్రతి ఉత్సవానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ఏడాదిలో రెండు సార్లు కైలాసగిరి ప్రదక్షిణం నిర్వహించటం ఆనవాయితి. సంక్రాంతి కనుమ రోజు నిర్వహించే గిరి ప్రదక్షిణం కైలాసగిరుల్లోని ముక్కోటి దేవతలకు మహాశివరాత్రి సందర్భంగా జరిగే స్వామి అమ్మవార్ల కళ్యాణానికి ఆహ్వానంగా అభివర్ణిస్తారు. శివరాత్రి కళ్యాణోత్సవం తరువాత జరిగే గిరి ప్రదక్షిణను తన వివాహానికి వచ్చిన దేవతల్ని తిరిగి వారి స్థావరాలకు చేర్చటం అని చెబుతారు. సుమారు 21 కిలో మీటర్ల గిరి ప్రదక్షిణలో ఎన్నో గ్రామాలున్నాయి. ప్రతి గ్రామం వద్ద స్వామి అమ్మవార్లకు ఘనస్వాగతం చెబుతారు. సుమారు 16 గ్రామాల్లో ఆ రోజు పండగ జరుపుకుంటారు. గిరిప్రదక్షిణ గ్రామాల్లో కనుమకు ఎంతో ప్రాధాన్యత ఉంది.

## గౌరమ్మ దర్శనం



**శ్రీకాళహస్తి,జనవరి 11 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసం సందర్భంగా ప్రతి రోజూ అమ్మవారికి గౌరమ్మగా ముస్తాబు చేసి ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం అలంకార మండపంలో అమ్మవార్లను చక్కగా ముస్తాబు చేసారు. ఆలయ అలంకార గురుకుల్ సూరి, సురేష్‌లు ముస్తాబు చేసారు.బోయిలు మోసుకుంటూ రాజగోపురం వద్ద గల అలంకార మండపం వద్ద చేర్చారు.అక్కడ సప్పరంలో ముస్తాబు చేసిన ఆలయ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్, దఫేదార్ రాజా వెంటరాగా ఉత్సవం కన్నుల పండువగా ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు తేరువీధి నుంచి ప్రారంభమై ఊరేగింపు నెహ్రూవీధి, నగరివీధి, బజారువీధుల గుండా ఉత్సవం సాగింది,

## జల వినాయకునికి పూర్వ వైభవం కల్పించండి



**శ్రీకాళహస్తి,జనవరి 11 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరుని మోక్ష గోపురం దిగువన వెలసిన జలవినాయకునికి పూర్వ వైభవం కల్పించాలని మాజీధర్మకర్తల మండలి సభ్యుడు అత్తేంజేరి బాలాజి ఇఒ టి.బాపిరెడ్డికి వినతి పత్రం అందించారు. పూర్వం ఇక్కడ శ్రీకృష్ణదేవరాయాలు మహామహులతో సంప్రదించిన తరువాత స్వర్ణముఖిలో వరద వస్తే వినాయకుని పాదాలను తాకేటట్లు ఏర్పాటు చేసారు.అయితే మారుతున్న కాలానుగుణంగా మార్పులు చేర్పులతో ఉనికిని పోగొట్టారు. 1999లో స్వర్ణముఖి నది వరద బాధలను తట్టుకొనుటకు ఫ్లడ్ వాల్ నిర్మించారు. నాటి జల వినాయకుని పాతాళ వినాయకునిలా మార్చారు. అయితే నేటి అవసరాల దృష్ట్యా ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా మూడవ గేటుకు ఎదురుగా ఉన్న వినాయకుని ఆలయాన్ని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తించాలి. ఇక్కడ నిత్యం ట్రాఫిక్ స్థంభిస్తుంది. భక్తులు ఇబ్బంది పడుతున్నారు.జల వినాయకుని జలవినాయకునిలా ఆచారాలను అనుసరించి పూర్వపు యథాస్థానానికి మార్చి గంగమ్మను తాకేలా ఏర్పాటు చేయాలని బాలాజి కోరారు.ఈ మేరకు ఇఒ బాపిరెడ్డికి వినతి ప త్రాన్ని సమర్పించారు.

## శ్రీకాళహస్తీశ్వరుని సేవలో హైకోర్టు జడ్జి

**శ్రీకాళహస్తి,జనవరి 11 ప్రభాతవార్త**



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి పూజలకు,అభిషేకాలకు అతిధుల తాకిడి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు.వారికి దక్షిణ గోపురం వద్ద ప్రోటోకాల్ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, పిఆర్‌ఒ రవి వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ఆశీర్వచనాలు అందించారు. వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా బందోబస్తును అర్బన్ సిఐ డి.గోపి పర్యవేక్షించారు.

## కెఎంఎం కళాశాలలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

**చంద్రగిరి, జనవరి 11 ప్రభాతవార్త:**




మన తెలుగింటి సంస్కృతీ సంప్రదాయాలకు సంక్రాం తి పండుగలు ప్రతీకలుగా నిలుస్తాయని కెఎంఎం ఇని స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ చైర్మన్ సాకే శ్రీనివాసులు అన్నారు. రామిరెడ్డి పంచాయతీ పరిధి లోని కెఎంఎం కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఆయన మాట్లా డుతూ సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని కళాశాల ఆవరణలో రంగురంగుల రంగోలీలు, ఫుడ్ స్టాల్స్, వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం భోగిమంటలతో సంబరాలను అంబరాన్నంటేలా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ సాకే త్రిపుర, ప్రిన్సిపాల్, విద్యార్థులు, అధ్యాపకులు, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇళ్ళత్తూరులో సిమెంటు రోడ్డుకు భూమిపూజ

**విజయపురం, జనవరి 11 ప్రభాతవార్త:**



మండలంలోని ఇళ్ళత్తూరు ఎస్టీ కాలనీలో శనివారం టీడీపీ సీనియర్ నాయకులు ముని భాస్కర్‌రాజు సిమెంటు రోడ్డుకు భూమిపూజ నిర్వహించారు.ఎన్నికల ప్రచార సమయంలో మాకు సిమెంటు రోడ్డు మంజూరు చేయాలని కోరడంతో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సిమెం టు రోడ్డు మంజూరు చేసి హామీ నెరవేర్చా రని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వరదరాజులు, ఏకుమలై, చెల్లమరాజు,హరిరాజు, మునికృష్ణమరాజు, వెంకటేశులు పాల్గొన్నారు.

## సంస్కృతీ సంప్రదాయాలు భావితరాలకు అందించేవే పండుగలు

**రామచంద్రాపురం, జనవరి 11 ప్రభాతవార్త:**




భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించేవే పండుగలని సెవెన్‌హిల్స్ ఫార్మశీ కళాశాల అడ్మినిస్ట్రేటివ్, అకడమిక్ ప్రొఫెసర్ లక్ష్మయ్య అన్నారు. శనివారం సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాలలో కోకో కోలా ఇండియా, సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాల సంయుక్తంగా సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. నాటి సంస్కృతీ, సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం వుందన్నారు. ప్రతి ఏడాది తమ కళాశాలలో సంప్రదాయ బద్ధంగా విద్యార్థులతో కలసి సంక్రాంతి పండుగను చేసుకోవడం ఆనవాయితీ అన్నారు. సంబరాలలో భాగంగా రంగోలీ, ఫుడ్ కార్నివాల్, మెహిందీ, ఫోక్ డ్యాన్స్, స్నేక్ రేస్ వంటి పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ శరవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఘనంగా జూనియర్ మిస్టర్ ఇండియా పోటీలు

**తిరుపతి విద్య, జనవరి 11 ప్రభాతవార్త:**



మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ సిటీ లేక్ వ్యూ గార్డెన్ నందు గోల్డెన్ ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూనియర్ మిస్టర్ ఇండియా పోటీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎలమంచి ప్రవీణ్ మాట్లాడుతూ మినిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్, మెన్స్ ఫిజిక్, ఉమెన్ ఫిజిక్, మాస్టర్స్ బాడీ బిల్డింగ్ కేటగిరీల ఈ పోటీలకు యావత భారతదేశం నుండి అన్ని రాష్ట్రాల పోటీదారులు వందల సంఖ్యలో పాల్గొన్నారని బహుమతులు ప్రధానోత్సవా కార్యక్రమానికి మధ్యప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జీవీ బాబు ,చైర్మన్ మోహన్ సింగ్ రాథోడ్, సంతోష్ సింగ్ చోప్రా, దుపెంద్ర సింగ్ సలాంకి, రితీష్ వీరం ,శివశంకర్ ఠాగూర్, ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు ఎస్ .వి.శివప్రసాద్, జి శ్రీహరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపైన, కాలువల్లో చెత్త వేస్తే జరిమానాలు విధించండి

**తిరుపతి కార్పొరేషన్, జనవరి 11, ప్రభాతవార్త**



నగరంలో ఎవరైనా రోడ్లపైన, మురుగు కాలువల్లో చెత్త వేస్తే జరిమానాలు విధించాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య హెల్త్, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం తెల్లవారుజాము నుండి నగరంలోని చిన్న బజారు వీధి, ఆకుతోట వీధి, నాదముని వీధి, కొత్త వీధి, కోటకొమ్మల వీధి, తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను ఆరోగ్య శాఖ, ఇంజినీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. చిన్న బజారు వీధిలో దుకాణాల ముందు చెత్త వేసి ఉండడం చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణాలు మూసిన తరువాత వేస్తున్నారని సిబ్బంది చెప్పగా, జరిమానాలు విధించాలని అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఎవరైనా రోడ్లపైన, కాలువల్లో చెత్త వేస్తే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని అన్నారు. పలు చోట్ల మురుగు కాలువల్లో చెత్త తొలగించలేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, సిబ్బంది పరిశీలించి శుభ్రం చేయాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, మేస్త్రిలు, అన్నారు.

## పడకేసిన జల్ జీవన్ మిషన్ లక్ష్యం...

**పాకాల, జనవరి 11, ప్రభాతవార్త**

పాకాల మండలం ఉప్పరపల్లి పంచాయతీ ఊట్లవారి పల్లిలో మంచినీటి చేతి బోరు పంపులు రిపేరు చేయమని ప్రజల విన్నపం మేరకు శిజూలీ వారు ఊట్ల వారి పల్లెలోని చేతి బోరు పంపులు మరమ్మత్తు కోసం బోరుల నుంచి 2024లో పైపులు వెలికితీసారు. కానీ ఇప్పటికి మూడో నెల గడుస్తున్నా బోరు మరమ్మత్తులు మాత్రం పూర్తి చేయలేదు. ఇప్పటికైనా జిల్లా స్థాయి ఉన్నత స్థాయి అధికారులు స్పందించి చేతి బోరు పంపులు రిపేరు చేసే విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని గ్రామ ప్రజలు మరియు బీజేపీ పార్టీ జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు కొడగంటి నరేంద్ర బాబు జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు..

## పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**వడమాలపేట, జనవరి 11 ప్రభాతవార్త:**



పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. శనివారం వడమాలపేట మండలం వసంతనగరం గ్రామంలో 2.30 లక్షల రూపాయలతో నిర్మించిన గోకులం షెడ్డును ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 90 శాతం రాయితీతో గోకులం షెడ్లు నిర్మించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ధనంజయలునాయుడు, వెంకటయ్య, సర్పంచ్ మణిరాజు, వెంకటేశ్వరరావు, పెద్దబ్బరాజు, ఆదినారాయణరాజు, మురళి, సోము, శివరాయల్, శివశంకర్ వర్మ,శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లె పండుగల సిమెంటు రోడ్డుకు ప్రారంభోత్సవం



**సత్యవేడు, జనవరి 11 ప్రభాతవార్త:** సత్యవేడు మండలం కొత్తమారికుప్పంలో నూతన సిమెంటు రోడ్డుకు టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. శనివారం టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు పరమశివం, మాజీ ఎంపీపీ మస్తాన్‌తో కలసి ఆయన సిమెంటు రోడ్డుకు రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పల్లె పండుగలో భాగంగా పలు పంచాయతీలో నిర్మించిన సిమెంటు రోడ్లను ప్రారంభిస్తున్నామన్నారు. ఇందులో కొత్తమారికుప్పంలో మెయిన్ రోడ్డు నుంచి రమణమ్మ ఇంటి వరకు ఉపాధి హామీ పథకంలో మంజూరైన 3.30 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డును నిర్మించామన్నారు. నాణ్యత విషయంలో రాజీ లేకుండా సిమెంటు రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. అనంతరం సిమెంటు రోడ్డుకు సంబంధించిన శిలాఫలకాన్ని అధికారులతో కలసినాయకులు పూజలు చేసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ షణ్ముగం, శశిమోహన్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ అమాసరెడ్డి, సురేంద్రరెడ్డి, మండల పరిషత్ ఇంజనీర్ ఇబ్రహీం ఖాన్, పంచాయతీరాజ్ విస్తరణాధికారి తరుణాక్ష రెడ్డి, ఉపాధి అధికారులు లోకమ్మ, సుమలత, మనోహర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మట్టి దందా టిప్పర్లను అడ్డుకున్న తెలుగు తమ్ముళ్లు

**సత్యవేడు, జనవరి 11 ప్రభాతవార్త:**



సత్యవేడు మండలం చెన్నేరి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ టిప్పర్లను దాసుకుప్పం పంచాయతీ గ్రామ వాసులు అడ్డుకున్నారు. చెన్నేరి పరుగు స్థలాల్లో పక్కా గృహ నిర్మాణాలు జరుగుతున్న కాలనీకి సమీపంలో గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్టు సమాచారం గ్రామస్తులకు అందింది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం టీడీపీ జిల్లా జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సుందరరామిరెడ్డి ఆధ్వర్యంలో లోకరెడ్డి, బాలయ్య, తదితరులు స్థలం చేరుకుని అక్రమ గ్రావెల్ తవ్వకాలను నిలిపివేయడంతోపాటు అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ టిప్పర్లను అడ్డుకోవడం జరిగింది. అక్రమ గ్రావెల్ తవ్వకాలపై సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించాల్సి ఉంది. మరి స్పందిస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.

## కోడి పందాలు, జూదాలపై పోలీసుల ప్రత్యేక నిఘా - సీఐ

**సత్యవేడు, జనవరి 11 ప్రభాతవార్త:**

సంక్రాంతి సందర్భంగా పోలీసులు బందోబస్తులో ఉంటారులే అని అనుకుంటే కర్మకాలినట్టే వేట మొదలుపెట్టిన పోలీసులు తిరుపతిజిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పుత్తూరు డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ మురళి ఆధ్వర్యంలో వరదయ్యపాలెం, సత్యవేడు, నాగలాపురం సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు, పేకాట, ఇతర జూదాలు ఆడే వారిపై ప్రత్యేకంగా పెట్టడం జరిగిందని సీఐ తెలిపారు. అదే విధంగా కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో సంతోషంతో చేసుకునే సంక్రాంతి జరుపుకోవాలని, పోలీసుశాఖ ఉద్దేశమని, అలా కాకుండా జూదగాళ్లు, వ్యసన పరులు సంతోషకరమైన సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు జూదాలుఆడికుటుంబాల్లోబాధనింపవద్దనిఅలాచేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## భాష్యంలో సంక్రాంతి సంబరాలు..

**తిరుపతి విద్య జనవరి 11 ప్రభాతవార్త:**




అవిలాల భాష్యం బ్లూమ్స్ సీబీఎస్ఈ స్కూల్ నందు జోనల్ ఇంచార్జ్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలకు రంగవల్లులు పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా జోనల్ ఇన్చార్జి లక్ష్మణ్ మాట్లాడుతూ ముగ్గులు మహిళలలోని కళకు సృజనాత్మకతకు ప్రతిరూపమని ఇలాంటి పోటీల వలన మహిళలలో కాస్తయినా పని ఒత్తిడి తగ్గి వారిలో ఉత్సాహాన్ని ఆనందాన్ని కలిగిస్తాయన్నారు. ప్రస్తుత సమాజంలో సంస్కృతి సాంప్రదాయాలను కాపాడేందుకు భాష్యం ఎప్పుడూ ముందుంటుందని తెలియజేశారు.గెలుపొందిన మహిళలకు పట్టు చీరలు బహుమతిగా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ ప్రిన్సిపల్స్ హెచ్.ఎం.లు, ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎస్.బాల సుబ్రమణ్యంకి డాక్టరేట్ ప్రదానం

**తిరుపతి విద్య జనవరి 11 ప్రభాత వార్త:**



తిరుపతి వాస్తవ్యుడు ఎస్ బాల సుబ్రమణ్యం నకు జనవరి 10వ తేది న గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు చెన్నైలో డాక్టరేట్ ప్రదానం చేశారు.గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ చైర్మన్,ఛాన్సలర్ డాక్టర్ పి.మాన్యుల్, వైస్ ఛాన్సలర్ జస్టిస్ డాక్టర్ కె.వెంకటేశన్,తమిళనాడు రాష్ట్ర ప్రిన్స్ పల్ సెక్రటరీ కె. సంపత్ కుమార్ ఐ ఎ ఎస్ చేతులు మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.తంగరాజు ఐ పి ఎస్ తమిళనాడు డాక్టర్ కె.రాజారాం ఐ పి ఎస్త,మిళనాడు డాక్టర్ ఎన్.రామచంద్రన్ ఐ పి ఎస్, పుదుచ్చేరి కళింగ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రప్ప సిద్దప్ప శ్రీలంక సైన్స్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్ చైర్మన్ ఎస్ కె. క్రిల్ సుడువెళ్ళ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ గాస్టన్ దాచెరే,ప్రొఫెసర్ డాక్టర్ ఇంక్ క్రిస్టియన్ ఎరిక్ స్టాలర్ పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## యువత క్రీడల్లో రాణించాలి

**-తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి లీలావతి**



చిల్లకూరు, జనవరి 11 ప్రభాతవార్త : యువత క్రీడా రంగంలో రాణించినప్పుడే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి పేర్కొన్నారు. చిల్లకూరు మండలం ఓడూరు గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ని శనివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలలో భాగంగా ఓడూరు, తీపనూరు యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రతి ఏటా నిర్వహిస్తుండడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ పట్నం సుమన్, దొడ్డగా చంద్ర, గుండు బోయిన వెంకటసుబ్బయ్య, మోడిబోయిన చక్రి, చెన్నూరు గురుహరి, బోళ్ల ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు



కోట, జనవరి 11 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టిలో శనివారం మెకానికల్, ఇఇఇ, ఐటి, సిఎస్ఇ, ఈసిఇ, ఎఐడిఎస్, విద్యార్థులకు మేనుకూరుకు చెందిన గ్రీన్‌టెక్ కంపెనీ వారు ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. అందులో సిఎస్ఇ ఐటి.ల నుంచి నలుగురు విద్యార్థులను మెకానికల్, ఈఈఈ ల నుంచి 46 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం 3.35 లక్షలగా ఇంటర్న్‌షిప్ అయిన తరువాత ఉద్యోగాల నియామకాలు ఇస్తారని ప్రాంగణ ఎంపికాధికారి, డాక్టర్ ఎస్.కిషందర్ తెలిపారు. అనంతరం కళాశాల డైరెక్టర్, డాక్టర్ వి. విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం సాధ్యమైనంత వరకు ఇప్పటికే పేరున్న బహుళజాతి కంపెనీలను ప్రాంగణ ఎంపికలను నిర్వహించామని పేర్కొన్నారు.

## పూర్వపు విద్యార్థిని, విద్యార్థుల సమావేశం



గూడూరు, జనవరి 11 ప్రభాతవార్త : గూడూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పూర్వపు విద్యార్థిని విద్యార్థుల సమావేశంను అలుమిని సెల్, అలుమిని అసోసియేషన్ అఫ్ నారాయణ ఇంజనీరింగ్ కాలేజీ గూడూరు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో దాదాపు వంద మంది పూర్వపు విద్యార్థులు హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చేశారని నారాయణ కళాశాల కళాశాల డైరెక్టర్ డాక్టర్ దత్తాత్రేయ శర్మ, డీన్ డాక్టర్ విశ్వక్సేనరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రవి ప్రసాద్‌లు తెలిపారు. అలాగే మ్యానేజ్మెంట్ తమ వంతు భవిష్యత్తులో అలుమిని ఛాప్టర్లు ముఖ్యమైన నగరాలలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. పూర్వపు విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులతో పరస్పర మంచి భవిష్యత్తుకు మరియు ఏమార్గాన్ని ఎంచుకోవాలో పలు సలహాలు సూచనలు చర్చించుకున్నారు. 2004లో బి.టెక్ ఈసీఈ విభాగంలో చదివిన పూర్వపు విద్యార్థుల్లో ఒకరు చిత్తూరు జిల్లాలో వున్న అమరరాజా కంపెనీ వారు పి.ఎల్.సి, పి.సి.బి నందు ఇంటర్న్‌షిప్‌ను అందిస్తోందని, ప్రస్తుత విద్యార్థులకు తెలిపారు. అంతేకాకుండా తమ జూనియర్ల మెరుగైన భవిష్యత్తుకు తమ వంతు సహాయం తప్పక ఉంటుందని తెలిపారు. ఎ.ఎ.ఎన్.ఇ.సి.జి. యొక్క స్టార్స్ టు మేక్ స్టార్స్ అనే నినాదానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొని తమ పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. సాఫ్టువేరు, కోర్ ఇండస్ట్రీస్లో స్థిరపడిన పూర్వపు విద్యార్థులు ఈ అవకాశమిచ్చిన కళాశాల మానేజ్మెంట్‌కు, తమ విజయంలో కీలక పాత్రా పోషించిన అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు, వివిధ విభాగాధిపతులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తమ బాధ్యతగా తమ జూనియర్లకు నెపుణ్యాలు, మెళకువలు సూచించారని తెలిపారు.

## క్రీడాకారులు క్రీడల్లో రాణించాలి




వాకాడు, జనవరి 11 ప్రభాతవార్త : క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గాయం శ్రీనివాసులు అన్నారు. శనివారం వాకాడు గ్రౌండ్‌లోని డాక్టర్ బి.ఆర్అంబేద్కర్ క్రికెట్ టోర్నమెంటు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా లీడర్ చరణ్‌రెడ్డి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గాయం శ్రీనివాసులు, కేవీసీ క్రిస్టియన్ ప్రెసిడెంట్ ప్రెసిడెంట్ దినకర బాబు, ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, అరుణ్ కుమార్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాయం శ్రీనివాసులు మాట్లాడుతూ వాకాడులో 2025 సంక్రాంతి సందర్భంగా వీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు మీద పెట్టడం అభినందనీయమన్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



వాకాడు, జనవరి 11 ప్రభాతవార్త : రాబోయే ఉత్తరాయణం, భోగి, సంక్రాంతి పండుగల విశిష్టతను తెలియజేయడానికి వాకాడు మండలంలోని కల్లూరు, కొత్తపాలెం, సాయిబులపాలెం, పల్లిపాలెం, ముట్టెంబాక, దుర్గవరం, గొల్లపాలెం, గూండ్లు, తూపిలిపాలెం, బూడిదల వాగు, కొండూరు, అందలమాల 12 గ్రామాల్లో శనివారం సాయిబులపాలెం గ్రామ వాస్తవ్యురాలు జి.మునిలక్ష్మి ఎంతో శ్రద్ధతో త్రైత సిద్ధాంత ప్రచారం నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు గురువు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతను అందించారు. ఈ కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు డి.సురమోళి, సుధాకరాచారి, ధనలక్ష్మి, నారాయణమ్మ, శేఖర్, శ్రీదేవి, కె.వి రత్నం, కొండమ్మ, సాయి తేజస్విని, గుప్త రాజు, రామయ్య, సురేంద్ర, సునీత, నరసింహ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ని కలిసిన



గూడూరు, జనవరి 11 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్‌ని గూడూరు జనసేననాయకులు నయీమ్ మర్యాదపూర్వకంగా కలిసారు. శనివారం పిఠాపురం నియోజకవర్గంలో పర్యటన చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ని గూడూరు నియోజకవర్గ జనసేన యువత అధ్యక్షులు నయీమ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేశారు. నయీమ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి ఆమడ దూరంలో ఉందని, మీరు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి అయిన తరువాత, గ్రామీణ ప్రాంతాల కొరకు రోడ్లు, నీటి సౌకర్యం కోసం బోర్లు కొరకు నిధులు మంజూరు చేయడంతో అభివృద్ధి పరుగులు తీస్తుంది అన్నారు. జనసేన పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఇవ్వండి అని చెప్పడం జరిగింది అని తెలిపారు. త్వరలోనే జిల్లాల పర్యటన మొదలు పెట్టి ప్రతీ కార్యకర్తని కలుస్తాను అని, ఏమైనా తెలియజేస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## దివ్యాంగులకు ట్రై సైకిళ్ళు పంపిణీ



చిల్లకూరు, జనవరి 11 ప్రభాతవార్త : దివ్యాంగుల అవసరార్థం వారికి ట్రై సైకిళ్ళు అందజేశామని, సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని ట్రస్టు వ్యవస్థాపకులు రాజినేని శ్రీనివాసులు నాయుడు తెలిపారు. చిల్లకూరు మండలం చేడిమాల గ్రామంలో రాజినేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దివ్యాంగులకు ట్రైసైకిళ్ళు, మరికొందరికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ట్రస్టు వ్యవస్థాపకులు రాజినేని శ్రీనివాసులు నాయుడు తదితరులు చేతులమీదుగా పది మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్ళు, 36 మందికి కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు డాక్టర్ అనూబ్ బాబు, ట్రస్టు ప్రతినిధులు చంద్రశేఖర్ నాయుడు, రామయ్య నాయుడు, భాస్కర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## బైక్ దొంగల అరెస్ట్‌లో మిస్టరీ ?

నాయుడుపేట, జనవరి 11 ప్రభాతవార్త : నాయుడుపేట, తడ ప్రాంతాల్లో బైక్ దొంగతనాలు జోరుగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో నాయుడుపేట పోలీసులు 8 బైక్‌లను స్వాధీనం చేసుకుని 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. కానీ ఇద్దర్ని మాత్రమే అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కానీ మిగతా 8 మందిని ఎందుకు అరెస్ట్ చేయలేదని నాయుడుపేటలో చర్చిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లతోనే వారిని అరెస్ట్ చూపలేదని విమర్శలు వినబడుతున్నాయని అంటున్నారు.

## కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు : డిఎస్‌పి

నాయుడుపేట, జనవరి 11 ప్రభాతవార్త : నాయుడుపేట డివిజన్‌లో ఎక్కడైనా కోడిపందేలు, జూదమాడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని నాయుడపేట డిఎస్‌పి చెంచుబాబు హెచ్చరించారు. ఆయన శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సంక్రాతి పండగ రోజుల్లో సంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కోడి పందేలు, డైమెన్ డబ్బా, జాదంలా వ్యవసనమై, ప్రజల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. కోడి పందేలు, జూదమాడినా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100,112కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాని కోరారు.

## యూనివర్సిటీ క్రికెట్ శిక్షణ తరగతులు



గూడూరు, జనవరి 11 ప్రభాతవార్త : మద్రాస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేది సౌజోన్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్‌కు జేఎన్టీయూఏ అనంతపురం తరపున పాల్గొనే క్రికెట్ జట్టుకు ఆదిశంకర కళాశాలలో గత వారం రోజులుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆదిశంకర కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆది శంకర కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య క్రీడా దుస్తులను క్రీడాకారులకు అందించి, కళాశాలలో ఎప్పుడు ఏ క్రీడలు జరిగిన ప్రోత్సహిస్తుంటామని చెప్పారు. ప్రతి సంవత్సరం ఇంటర్ కాలేజ్ గేమ్స్ కూడా మా కళాశాల వారు నిర్వహిస్తుంటారని చెప్పారు. గుడ్లూరు రవిచంద్ర క్రీడా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఏట రామయ్య, జేఎన్టీయూఏ అనంతపురం క్రికెట్ టీంకి ఎన్నుకొనబడిన 16 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

## టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న కిషోర్



సూళ్లూరుపేట, జనవరి 11 ప్రభాతవార్త : సూళ్లూరుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎఆర్ బాలచంద్ర (కిషోర్) శనివారం టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సమక్షంలో లక్ష రూపాయలు సభ్యత్వ రుసుము చెల్లించి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, అలవల శ్రీనివాసులు, ఆర్.రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు, సిహెచ్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా టిడిపి సభ్యత్వ నమోదు



సూళ్లూరుపేట, జనవరి 11 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ గత కొన్నిరోజులుగా సూళ్లూరుపేట పట్టణంలో చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం పట్టణంలోని సూళ్లూరు ప్రాంతంలో ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షులు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో భారీగా సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షులు ఆకుతోట రమేష్ మాట్లాడుతూ సూళ్లూరుపేట పట్టణంలో పార్టీ అధిష్టానం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు ఎజి కిషోర్, లింగం కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిన వైసిపి ప్రభుత్వం

**-ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**



వెంకటగిరి, జనవరి 11 ప్రభాతవార్త : గత వైసిపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి మండలం చిన్నాన్న పేట గ్రామంలో 2లక్షలతో నిర్మించిన మినీ గోకులం షెడ్డును ప్రారంభించారు. రైతులు పశువులను ఇళ్ల వద్ద ఉంచుకొని ఇబ్బంది పడుతున్నారని కూటమి ప్రభుత్వం 90 సబ్సిడీతో గోకులం షెడ్లను నిర్మించినట్లు తెలిపారు. పశువులు, గొర్రెలు, కోళ్ల కోసం ప్రభుత్వం సబ్సిడీతో రైతులకు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రైతుల అభ్యున్నతి ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. గుంటలమెట్లగా ఉన్న రోడ్లను ప్రభుత్వం బాగు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తమ్మిరెడ్డి తనుజరెడ్డి, ఎంపీడీవో కేవీ కోటేశ్వరరావు, ఉపాధి పథకం ఏపీవో దీప, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కె.వికే ప్రసాద్ నాయుడు, నాయకులు మధురెడ్డి, శ్రీనివాసులు, చలపతి నాయుడు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జీవిత టిడిపి సభ్యత నమోదు చేసుకున్న గంగాధర్



వెంకటగిరి, జనవరి 11 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ జీవితకాలం సభ్యత్వాన్ని పట్టణ పార్టీ అధ్యక్షుడు శ్రీరామదాసు గంగాధర్ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ద్వారా తీసుకున్నారు. లక్ష రూపాయలను పార్టీ సభ్యత్వానికి ఆయన చెల్లించారు. తెలుగుదేశం పార్టీ పేదల పార్టీ అని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు.

## క్రీడలు పట్ల యువత మక్కువ చూపాలి



బాలాయపల్లి, జనవరి 11 ప్రభాతవార్త : క్రీడలు పట్ల యువత మొగ్గు చూపాలని మాజీ సొసైటీ అధ్యక్షులు వెందోటి కార్తికరెడ్డి తెలిపారు. పండుగలు సందర్భంగా కార్తీక్‌రెడ్డి పేరుతో నిర్వహించే క్రికెట్ పోటీలను ఆయన జయం గ్రామంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పండుగలను ఉల్లాసంగా ఉత్సాహంగా జరుపుకోవాలని కోరారు. క్రికెట్ పోటీల్లో పాల్గొని విజయాతులైన వారికి బహుమతులను అందజేస్తామని తెలిపారు.

## జిల్లాలో 20 సూత్రాలను పటిష్టంగా నిర్వహించాలి



తిరుపతి కలెక్టరేట్, జనవరి 11 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాలో 20 సూత్రాల కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని ఇరవై సూత్రాల కార్యక్రమాల ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన 20 సూత్రాల కార్యక్రమాల ఛైర్మన్ లంకా దినకర్ తిరుపతి జిల్లా కేంద్ర ప్రయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, తిరుమలకు వచ్చే భక్తులకు, పర్యాటకులకు అవసరమైన మౌళిక సదుపాయాలు, స్మార్ట్ సిటీగా తిరుపతి అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రధాని మోదీ లక్ష్యం వికసితభారత్-2047 లక్ష్యంతో పని చేస్తేనే తిరుపతి పార్లమెంట్ పరిధిలోని ప్రస్తుత సవాళ్ళను అధిగమించి విజయవంతంగా వికసిత తిరుపతిగా రూపుదిద్దవచ్చునన్నారు. పట్టణాలల్లో ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటి సరఫరా కోసం తిరుపతి కార్పొరేషన్ కోసం అమృత్ 1.0 క్రింద 2017లో కేటాయించిన నిధులకు సంబంధించిన పనులలో ఇప్పటికీ పూర్తి కాని పరిస్థితులు ఉన్నాయన్నారు. దానికి కారణం గడిచిన ఐదేళ్ళు అస్తవ్యస్థ విధానాలు అన్నారు. ఇప్పుడు అమృత్ 2.0 కింద నిధులు మంజూరు అయ్యాయి అన్నారు. ఈ నిధులు సద్వినియోగం చేసుకుని గతంలో పూర్తి కాని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ డీఆర్వో నరసింహులు, టీటీడీ బోర్డు మెంబరు భాను ప్రకాష్‌రెడ్డి, సంబంధిత అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా వడ్డె ఓబన్న 218వ జయంతి వేడుకలు

**- ప్రధాని, సిఎం, డిసిఎం చిత్రపటాలకు పాలాభిషేకం**

**- వడ్డెర కులస్తుల సమస్యల పరిష్కారంకు సిఎం ఆదేశాలు**



కుప్పం, జనవరి 11 ప్రభాతవార్త : ఆంగ్లేయులపై పోరాటంలో వీరోచితంగా పోరాడిన స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న 218వ జయంతిని శనివారం వడ్డెర కులస్తుల సంఘం ఆధ్వర్యంలో కుప్పంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంలు హాజరయ్యారు. ఈసందర్భంగా వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర పండగగా గుర్తించడంతో వడ్డే ఓబన్న, ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్ కళ్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ వడ్డె ఓబన్న చరిత్రను మరింత లోతుగా ఆవిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. కుప్పంలో వడ్డెర కులస్తులు తెలుగుదేశం పార్టీకి ఎన్నికల్లో పెద్ద ఎత్తున మద్దతు పలికారన్నారు. కుప్పంలో వడ్డెర కులస్తుల సమస్యల పరిష్కారంకు సిఎం చంద్రబాబునాయుడు ఇదివరకే ఆదేశించారన్నారు. త్వరలోనే త్రిమెన్ కమిటీ కుప్పం వచ్చి వడ్డెరల పరిస్థితులపై అధ్యయనం చేస్తుందన్నారు. మరో పక్క జీవనోపాధి పొందే వడ్డెర కులస్తులకు ప్రభుత్వం తరపున దాదాపు వంద ఎకరాల్లో రాతిపని కల్పించేదిశగా చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ త్వరలోనే కుప్పం వచ్చి ఉపాధి కల్పనకోసం గుట్ట భూములను పరిశీలిస్తారన్నారు. వడ్డెర కులస్తులకు సిఎం చంద్రబాబునాయుడు ఎప్పటికీ అండగానే ఉంటారన్నారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, జనసేన కోఆర్డినేటర్ నరేష్, రాష్ట్ర నేత గోపీనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ రవి, వడ్డెర సంఘం అధ్యక్షుడు మాధవన్, నేతలు బాలు, కెవిశ్రీనివాసులు, కృష్ణయ్య, బేటప్ప, రోహిత్, సుబ్రమణ్యం, రవి, చలపతి, జయరాం, రామచంద్ర, కృష్ణప్ప, చెంగప్ప పాల్గొన్నారు.

## గణనాధునికి వెండి కిరీటం బహూకరణ



కాణిపాకం, జనవరి 11 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారికి ఓ భక్తుడు శనివారం వెండి కిరీటాన్ని విరాళంగా అందజేశారు. తవణంపల్లె మండలం నత్తపుచేనుకు చెందిన యశ్వంత్ అనే దాత సుమారు లక్ష రూపాయల వ్యయంతో కిలో వెండితో ప్రత్యేకంగా తయారు చేయించిన కిరీటాన్ని ఆలయానికి విరాళంగా అందజేశారు. ఈకిరీటాన్ని దాత కుటుంబ సభ్యులతో కలసి ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ వాసు దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## శనీశ్వరునికి షోడషాభిషేకాలు



శ్రీకాళహస్తి, జనవరి 11 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు అలంకారాలు నిర్వహించారు. శనివారం ఆలయంలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. ముఖ్యంగా శనీశ్వరాభిషేకాలకు భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం ఉదయం నుంచి ఆలయంలో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. కాలసర్పదోష నివారణ పూజలకు భక్తులు క్యూకట్టారు. ఉదయం నుంచి భక్తుల రద్దీతో పాటు రాహుకాల సమయంలో శనీశ్వరాభిషేకాలకు కదలి వచ్చారు. శనివారం నాడు ఇక్కడ రాహుకాల సమయంలో అభిషేకాలు జరిపించుకోవటానికి హాజరౌతున్నారు.

## సమరానికి సై... తగ్గేదేలే !

**కాలు దువ్వుతున్న పందెం కోళ్లు**

కోట, జనవరి 11 ప్రభాతవార్త : సంక్రాతి పండగ నేపథ్యంలో కోడి పందేల నిర్వాహకులు బరులు సిద్ధం చేసుకుంటున్నారు. పందేలు నిర్వమించడానికి వీల్లేదని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు ఉన్నాయి. పోలీసులు కూడా పందేలు ఏర్పాట్లు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. కోట మండలంలోని కొత్తపట్నం, కర్లపూడి, రాఘవపురం, కొత్తపాళెం, చెందోడు తదితర గ్రామాల్లో గత సంక్రాతి పండగ సందర్భంలో కోళ్ల పందేలు జోరుగా సాగాయి. ఏటా కోడి పందేలు జోరుగా సాగుతున్న విషయం బహిరంగ రహస్యమే, అనేక గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వేలాది రూపాయలు వెచ్చింది కోనుగోలు చేసినకోడి పుంజులను పందేలకు సిద్ధం చేస్తున్నారు. అదే క్రమంలో ఆటు వాకాడు, ఇటు చిల్లకూరు మండలాల్లో నుంచి కూడా పందేల కోసం వస్తుంటారు.

## యూనివర్సిటీ నిఘా కెమెరాలలో చిరుత జాడలు!



తిరుపతి విద్య, జనవరి 11 ప్రభాతవార్త : శ్రీ వేంకటేశ్వరా విశ్వవిద్యాలయం లో జనవరి మూడో తారీకు రాత్రి 9 గంటలకు నిఘా కెమెరాలలో చిరుత జాడలు కనిపించడం, మరలా శనివారం చిరుతను చూసి రీజనల్ సైన్స్ సెంటర్ వద్ద ఒక వాహనదారుడు ప్రమాదానికి గురి కావడం వర్సిటీ ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు సూచనలతో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా పాకనాటి హరికృష్ణ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుదర్శన్ దృష్టికి తీసుకువెళ్లడం, ఆయన స్పందించి పై అధికారులతో మాట్లాడి వర్సిటీ పరిసర ప్రాంతాలలో చిరుత పులికి ట్రాప్ బోన్ నూ ఏర్పాటు చేయనున్నామని తెలియజేశారు. ఇప్పటికే ఎస్వీయూ ఉన్నతాధికారులు వర్సిటీలలో చిరుత పులి సంచారంపై ప్రమాద హెచ్చరిక బోర్డులను నెలకొల్పాలని యూనివర్సిటీ ఇంజనీర్ తాండవ కృష్ణ కూ సూచించారు. అదే విధంగా విద్యార్థినీ విద్యార్థులు, వర్సిటీ ఉద్యోగులు రాత్రి 7 గంటల నుండి ఉదయం 7 గంటల వరకు సంచరించవద్దని వర్సిటీ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. చిరుత ఉనికి ఎదురైతే ఫారెస్ట్ అధికారులైన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్ బి ఓ) 9440090809, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్( ఎఫ్ ఎస్ ఓ) 9492549171 ల ఫోన్ నెంబర్లుకూ సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

## కల్యాణ వెంకన్న ఆలయంలో ఆగమోక్తంగా చక్రస్నానం

**తిరుచ్చి వాహనంపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు**



చంద్రగిరి, జనవరి 11 ప్రలభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం ద్వాదశి రోజున స్వామి వారి (సుదర్శన చక్రం) చక్రత్తాళ్వార్లకు ఆలయ అర్చకులు చక్రస్నానం ఆగమోక్తంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ద్వాదశి రోజున ఉదయం పుష్కరిణి వద్ద సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాలు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, గంధంతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. చక్రస్నానం (అవభృథం)లో శ్రీవారి సుదర్శన చక్రంకు (చక్రత్తాళ్వార్‌కు) పుష్కరిణిలో స్నానం నిర్వహించే స్నపన తిరుమంజనం నిర్వహించారు. అర్చకులు సుదర్శన చక్రాన్ని పవిత్ర పుష్కరిణీ జలాల్లో ముంచి స్నానం చేయించారు. ఆ దివ్యాయుధ స్పర్శ వలన పుష్కరిణి జలానికి మరింత పవిత్రత లభిస్తుంది. అట్టి పుష్కరిణిలో భక్తజనం స్నానమాచరించడం వలన బ్రహ్మోత్సవ యజ్ఞ ఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం. అదేవిధంగా సాయంత్రం రోహిణీ నక్షత్రంను పురస్కరించుకుని స్వామి వారు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు విశేష అలంకృతులై తిరుచ్చి వాహనంపై తిరుమాడవీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ వరలక్ష్మి, ఏఈఓ ఎం.గోపినాద్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ డి.మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి, బాలాజీ రంగాచార్యులు, నారాయా చార్యులు, నారాయణం శేషాచారు ్యలు, సిబ్బంది రవిచంద్రన్, పి.టి.ఉదయ్‌తేజ, మూర్తి, హెచ్ఎం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీ ట్రిపుల్ ఐటీలో ఘనంగా స్నాతకోత్సవం

**ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ఆన్‌లైన్‌లో స్నాతకోపన్యాసం**



శ్రీసిటీ. జనవరి 11 ప్రభాతవార్త: తిరుపతిజిల్లా శ్రీసిటీ ట్రిపుల్ ఐటీలో 2024 సంవత్సరానికి సంబంధించి స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మొత్తం 298 మంది విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వి.కార్తికేయన్ పట్టాలను ప్రధానం చేశారు. ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ చైర్‌పర్సన్, జోహో కార్పొరేషన్ ప్రైవేటు లిమిటెడ్ వ్యవస్థాపకుడు, సీఈవో శ్రీధర్ వెంబు వర్చువల్‌గా సమావేశానికి అధ్యక్షతన వహించగా, ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ముఖ్య అతిథిగా ఆన్‌లైన్‌లో ద్వారా పాల్గొన్నారు. శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, క్యాటర్ పిల్లర్ టెక్నాలజీ వైస్‌ప్రెసిడెంట్ భువన్ ఆనందకృష్ణన్, ఎ.డబ్ల్యు ఎస్ ఇండియా చీఫ్ టెక్నాలజిస్టు శాలిని కపూర్ తదితర సెనేటర్లు పాల్గొన్నారు. ఈ స్నాతకోత్సవంలో ఐదుగురికి పీహెచ్‌డీ ఇద్దరికి ఎంఎస్ఇద్దరికి, ఎంటెక్, 289 మందికి బీటెక్ పట్టాలను ప్రధానం చేశారు. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో ప్రత్యేకప్రతిబ కబనరచిన విద్యార్థులు ఈ జాబితాలో ఉన్నారు. బీటెక్ విభాగంలో మొడపా మోహన్‌సాయికృష్ణ(కంప్యూటర్ సైన్స్), దాచర్ల శ్రీజ(ఎలక్ట్రానిక్స్, కమ్యూ నికేషన్) బంగారు పతకాలను అందుకున్నారు. కార్యక్రమంలో పట్టభద్రులు తమ ఉపాధ్యాయులను ముఖాముఖిగా కలుసుకుని స్నేహితులు, జూనియర్లను ఆత్మీయంగా కలసి గతస్మృతులను స్మరించుకున్నారు. కార్యక్రమం పట్టభద్రులందరిలో ఒక మధుర జ్ఞాపకాన్ని మిగిల్చింది.

## ద్వాదశిన వైకుంఠద్వార దర్శనంలో రోజా

తిరుమల, జనవరి 11ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠద్వాదశిన శనివారం ఉదయం మాజీ మంత్రి ఆర్కె రోజా శ్రీవారిని దర్శించుకున్నారు. తన సోదరుడితో కలసి వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయం వెలుపల ఆమె మౌనంగానే చిరునవ్వుతో వెళ్లిపోయారు.

**CLASSIFIED**

I,**BILLU SONIA** (old name), R/at D.No. 1/81, Siddareddypalli, B.P.Rachapalli (P), Chitvel (M) Annamayya Dist.A.P. I have changed my name as **MURAGANI SONIA** W/o Muragani Ravi (New Name).

I,**CHINNAKOTTLA VENKATRAMANA** (old name), R/at D.No. 127, 2nd Street, Balaji Nagar, Tirumala, Tirupati Dist.A.P. I have changed my name as CHINNAKOTTLA VENKATARAMANA S/o Chinnakottla Munirathnam (New Name).